విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 03 ఫిబ్రవరి 2025 8 పేజీలు

సమన్వయంతో పనిచేద్దాం

- జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి
- మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేల పిలుపు
- ఘనంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవం
- ప్రకాశం పంతులుకు ఘన నివాళులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : భిన్న పరిస్థితులు ఉన్న జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయటంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం భవనంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఆవరణములో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు (ఒంగోలు),. బి.ఎన్. విజయ్ కుమార్ (సంతనూతలపాడు), రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్. నూకసాని బాలాజీ, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో వేడుకలు

నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు, శిశు మరణాలను తగ్గించి నీటిపారుదల, పారిశ్రామిక రంగాలు అభివృద్ధి చేసి, జిల్లా నుంచి వలసలు వెళ్లకుండా స్థానికంగానే యువతకు ఉపాధి కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. విస్తారంగా ఉన్న భూములను ఈ విధంగా వినియోగంలోకి తెస్తామన్నారు. కనిగిరి ప్రాంతంలో పునరుత్పాదక ఇంధన పరిశ్రమ, గిద్దలూరులో లెదర్ పార్కు ఇందులో భాగమన్నారు. రామాయపట్నం పోర్టు, హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్న కందుకూరు నియోజకవర్గం కూడా త్వరలోనే ప్రకాశం జిల్లాలో విలీనం అవుతుందని మంత్రి చెప్పారు. భారత్ పెట్రోలియం రిఫైనరీ యూనిట్ కూడా త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. పొగాకు అనుబంధ పరిశ్రమలు కూడా జిల్లాలో

మిగతా 2 లో ...

శాంతిభద్రతల పరిరక్షణలో

సాయుధ బలగాల పాత్ర కీలకం

- నైపుణ్యాలకు మెరుగులు దిద్దేలా 'మొబలైజేషన్'
- వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణను పాటించాలి
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ బలగాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన డీ మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసు బలగాల ప్లటూన్లను పరిశీలించారు. ప్లటూన్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పెరేడ్ బ్యాండ్‌ను చాలా చక్కగా ప్రదర్శించారని సిబ్బందిని ఎస్పీ అభినందించారు. జిల్లాలో పూర్తిస్థాయిలో సాయుధ బలగాలు ఉన్నాయన్నారు. సిబ్బందికి విధులలో నైపుణ్యం పెంపొందించడానికి ప్రతి సంవత్సరం మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జనవరి 20వ తారీకు నుండి ఫిబ్రవరి 2వ తారీకు వరకు ప్రతి ప్లేటున్‌లో 40 మంది చొప్పున 8 ప్లేటున్‌లతో మొబలైజేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు

మిగతా 2 లో ...

'ఉపాస' వైద్యులు మోసం

6లో

పాలన చేతకాదనే గద్దె దించారు..

- అందుకే 11 సీట్లు ఇచ్చి వైసీపీని ఇంటికి పంపారు
- పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు, రాష్ట్ర అభివృద్ధికి దత్తపుత్రుడు
- పవన్ కళ్యాణ్ నేతృత్వంలో అభివృద్ధి పథంలో గ్రామపంచాయతీ
- అసెంబ్లీకి వెళ్ళని వైసీపీ ఎమ్మెల్యేలు గన్ మెన్‌లతో పాటు, జీతాలు వెనక్కి పంపాలి
- జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ఫైర్

2లో

-విశాలాంధ్ర, ఒంగోలు

- దత్తక్షేత్రం కాలనీలో అక్రమ నిర్మాణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వీఆర్ఓ
- పీజిఆర్ఎస్ ఫిర్యాదులు బుట్ట దాఖలు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ దత్తక్షేత్రం కాలనీ లే అవుట్ అప్రూవల్ ప్లాన్‌కు విరుద్ధంగా ఫ్లాట్ నంబర్ 6కు దక్షిణం, పడమర దిక్కు హద్దుగా ఉన్న 15 అడుగుల రోడ్డును, దక్షిణ దిక్కు హద్దుగా ఉన్న రోడ్డు మార్జిన్ సైతం ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణం చేపట్టి పునాదులు తవ్వకాలు చేపట్టి పిల్లర్స్ నిర్మాణం చేస్తున్న సమయంలో గత అక్టోబరు 10వ తేదీ నుండి వివిధ దశలలో స్థానిక వీఆర్ఓకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా, నిర్మాణ పనులు నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు(వీ.ఆర్.ఓ, సర్వేయర్‌లు) ప్లాట్ హద్దులు దాటి రోడ్డు ఆక్రమం జరిగిందని నిర్ధారించారని స్థానికులు చెబుతున్నారు. కానీ స్థానిక వీఆర్ఓ సహకారంతో గత రెండు నెలలుగా పునాదులు, పిల్లర్స్, బేస్మెంట్, స్లాబ్ లెవల్ వరకు భవనం నిర్మాణం చేశారు. ఇప్పుడు మెట్లు, స్లాబ్ నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దశలవారీగా భవన నిర్మాణ పనులు చేస్తున్న ప్రతి సందర్భంలో అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికి ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అక్రమ నిర్మాణం పూర్తి చేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు కూడా చేసినప్పటికీ కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు స్థానికులు పి.జి.ఆర్.ఎస్. ఫిర్యాదులు

మిగతా 2 లో ...

సాయుధ బలగాల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. మొబలైజేషన్ కార్యక్రమంలో వృత్తి నైపుణ్యాల పెంపునకు ఇన్,అవుట్ డోర్ క్లాస్‌లు, సర్వీస్ రూల్స్, అత్యాధునిక ఆయుధాలను ఎలా ఉపయోగించాలి, డ్రిల్, మార్చ్ ఫాస్ట్, మాబ్ కంట్రోల్, విఐపి ఎస్కార్ట్స్, పీఎస్‌వో, బి.డి టీం, ప్రిజనర్స్ ఎస్కార్ట్, బందోబస్త్, మోటార్ వెహికల్ డ్యూటీలు తదితర అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా సిబ్బంది మంచి తర్ఫీదు పొందారని తెలిపారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వాటిని అదుపు చేయడానికి వెంటనే అక్కడికి సాయుధ బలగాలను పంపిస్తుంటామన్నారు. ఏ.ఆర్ సిబ్బంది సంక్షేమం కొరకు పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది ఆరోగ్యానికి పెద్ద పీఠ వేస్తూ అక్టోబర్ నెలలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించి సుమారు 400 మంది వరకు పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా మొబిలైజేషన్ లో భాగంగా సుమారు 300 మంది ఏఆర్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. సిబ్బంది సమస్యలు పరిష్కారం చేందుకు ప్రతి నెల చివరి శుక్రవారం గ్రీవెన్స్ డేగా నిర్వహిస్తున్నా మన్నారు. సిబ్బందిలో ఎవరికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే తగు చర్యలు తీసుకొని సత్వరం పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. సబ్సిడీ తో కూడిన వస్తుసరుకులు పొందుటకు పోలీస్ వెల్ఫేర్ క్యాంటిన్ ను, షాపింగ్ కాంప్లెక్స్ ను రాబోయే రోజులలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాధారణ బందోబస్తు విధుల నుండి శాంతిభద్రతల సమస్యల వరకు ఏ.ఆర్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించు కోవడంతో పాటు సమర్థవంతమైన విధుల నిర్వహణ కోసం శారీరక ధృడత్వానికి అధిక ప్రాధాన్య మివ్వాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వృత్తి, వ్యక్తిగత క్రమశిక్షణను పాటించడంలో జిల్లా ఏఆర్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరిగేలా సాయుధ బలగాల పనితీరు ఉండాలని సూచించారు. పెరేడ్ గ్రౌండ్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం, మొబిలైజేషన్ ప్రక్రియలో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందిని, అలాగే పెరేడ్‌ను క్రమశిక్షణతో చక్కగా నిర్వహించిన పెరేడ్ కమాండర్ ఆర్ఐ మౌలుద్దీన్ ను జిల్లా ఎస్.పి గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డి.ఎస్.పి విజయ సారథి, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, సిసిఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, డి.ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్, ఆర్ ఎస్సై లు, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

(మొదటిపేజీ తరువాయి)

బి. పి. టి.2024111313, బి. పి. టి.20241107176, బి. పి. టి.202501273705 చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి, ప్లాట్ నెం.6 లబ్ధిదారు మన్నేపల్లి రాజేశ్వరి తన సమీప బంధువు మందారపు దుర్గా అనే వ్యక్తి మధ్యవర్తిత్వంతో తన నివేశన స్థలమును మున్నాళ్ల మరో వ్యక్తికి అమ్మి వేయడంతో ఈ సమస్య మొదలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో పరిశీలించి దత్తక్షేత్రం కాలనీ లే అవుట్ అప్రూవల్ ప్లాన్ ప్రకారం సర్వే చేయించి, ఆక్రమించిన రోడ్, రోడ్ మార్జిన్ భూమిని గుర్తించి, నిర్మాణాన్ని తొలగించి, అక్రమ నిర్మాణదారు మీద క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు సహకరించిన వల్లారెడ్డిపాలెం 2 వీ.ఆర్.ఓ మీద క్రమశిక్షణా చర్యలు తీసుకుని దత్తక్షేత్రం కాలనీలోని ఖాళీ స్థలములకు, రోడ్ మార్జిన్స్ కు రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ మతతత్వాలను రెచ్చగొడుతుంది

కమ్యూనిజం మాసపత్రిక మాజీ సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-ఒంగోలు : బిజెపి మతతత్వాలను రెచ్చగొట్టి తమ పబ్బం కదుపుకుంటుందని కమ్యూనిజం మాస్ పత్రిక పూర్వ సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మద్దిపాడు ప్రధాన కోడళ్లో సిపిఐ జెండాను మండల సీపీఐ నాయకులు తొట్టెంపూడి వెంకట శేషయ్య ఆవిష్కరించారు. ఎంసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి పూర్తిచేసుకుని 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని వందవ సంవత్సరాలలోకి అడుగు పెట్టిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి కృషి దన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన దగ్గర నుంచి భూమికోసం భుక్తి కోసం పేద ప్రజలు విముక్తి కోసం పోరాటాలు చేస్తుందన్నారు. ప్రైవేటు సంస్థలు జాతీయ జాతీయం చేసిన ప్రాజెక్టుల్ని మళ్ళా ప్రైవేట్ దళారుల చేతుల్లోకి తీసుకువెళ్లి పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పన్నాగాలు పన్నుతుందన్నారు. ప్రజలందరూ ఈ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తున్న ప్రభుత్వం పెడవెవిన పెడుతుందన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ప్రాజెక్టు గేట్లు పూర్తి కాకపోవడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వం రైతులకు తాగునీరు సాగునీరు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒంగోలు పట్టణానికి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల నాయకులు టీవీ శేషయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోసపూరిత విధానాలను ప్రజలందరూ గమనించాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు పాలకులు కొమ్ముగాస్తున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు అన్ని హంగులను ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలం చెందారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొత్తపల్లి శాఖ కార్యదర్శి నల్లజర్ల శ్రీనివాసరావు సీనియర్ నాయకులు పొపులూరి అంజయ్య రైతు సంఘం నాయకులు గోగినేని వెంకటేశ్వర్లు సిపిఐ కార్యకర్తలు నాతాని కోటిలింగం, ఎద్దు రవి, బండి కోటిరెడ్డి, పాతపాటి శ్రీనివాసరావు, నాగండ్ల వెంకటేశ్వర్లు, బొమ్మల గోపి పాల్గొన్నారు.

పాలన చేతకాదనే గద్దె దించారు..

జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ఫైర్

విశాలాంధ్ర-ఒంగోలు : పాలన చేతకానిది వైయస్ జగన్మోహన్ రెడ్డికే నని, అందుకే అతని పార్టీకి 11 సీట్లు ఇచ్చి ఇంటికి పంపారని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ధ్వజమెత్తారు. స్థానిక రవి ప్రియ మాల్‌లో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. రియాజ్ మాట్లాడుతూ 7 నెలల ఎన్‌డిఏ కూటమిపాలనలు చేసిన అభివృద్ధి పనులు వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి కనిపించడం లేదా అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధాప్య పింఛన్లను రూ. 3 వేల నుండి రూ. 4 వేల వరకు, అలాగే వికలాంగుల పింఛన్ ను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. 2019 నుండి 2024 వరకు అభివృద్ధిలో కుంటుపడింది అన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. అటువంటి వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి 7 నెలల పాలన పై అవాకులు చవాకులు పేలటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను దత్త పుత్రుడు అని విమర్శించటం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు దత్త పుత్రుడని, రాష్ట్ర అభివృద్ధికి దత్తపుత్రుడని, రాష్ట్రానికి కేంద్రం నుండి అధిక నిధులు రాబట్టటంలో, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కట్టుబడి ఉన్న వ్యక్తి అని అన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామ పంచాయ తీలు సస్యశ్యామలంగా ఉన్నాయన్నారు. పంచాయతీలకు నిధులు ధారాళంగా వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వెళ్లి మాట్లాడలేని వైసీపీ ఎమ్మెల్యేలు తమ గన్మెన్లను వెనక పంపి, ప్రజాధనం ద్వారా తీసుకుంటున్న జీతాలను కూడా వెనక్కు పంపాలని డిమాండ్ చేశారు. అ కేవలం 7 నెలల పాలనలోని రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది తో పాటుగా, కేంద్రం నుండి అత్యధిక నిధులు రాబట్టటంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు చిట్టెం ప్రసాద్, కాసాని వాసు, ముత్యాల కళ్యాణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ దిశగా కూడా ఇటీవల ముఖ్యమంత్రి జరిపిన దావోస్ పర్యటనలో చర్చలు జరిగినట్లు మంత్రి తెలిపారు. నదులను అనుసంధానం చేయటం పైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ఈ పరిణామం కూడా జిల్లా అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంతో పాటు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా జిల్లాలో అవసరమైన చోట చెక్ డ్యాముల నిర్మాణాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బేస్తవారిపేట నుంచి ఒంగోలుకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను ఈ ఏడాదే ప్రారంభిస్తామన్నారు. పర్యాటక , ఆక్వా, గ్రానైట్ పరిశ్రమ రంగాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని మంత్రి తెలిపారు. ప్రకాశం యూనివర్సిటీ, ఒంగోలు డైరీ పైనా ముఖ్యమంత్రి దృష్టి సారించినట్లు ఆయన చెప్పారు. ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటుతో పాటు చిన్న , సూక్ష్మ పరిశ్రమలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. స్థానికంగా ఉన్న భౌగోళిక, మానవ వనరులను అందిపుచ్చుకొని జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ విజన్ - 2047 లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించిన పది సూత్రాలను పరిగణనలోకి తీసుకొని ఆ కోణంలో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. భౌగోళికంగా రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా అతి పెద్దదని, అభివృద్ధి పరంగానూ అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ దిశగానే జిల్లా విజన్ డాక్యుమెంటును రూపొందించామన్నారు. ఒంగోలు శాసనసభ్యులు మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు తలమానికమైన వెలుగొండ ప్రాజెక్టు త్వరలోనే పూర్తవుతుందన్నారు. జిల్లాను అభివృద్ధి పరంగా ముందుకు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు మాట్లాడుతూ గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల నుంచి వెనకబడిన ప్రాంతాన్ని వేరు చేసి ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. ఆ వెనుకబాటుతనాన్ని అధిగమించి అభివృద్ధిలో దూసుకు వెళ్లేలా చూడాల్సిన బాధ్యత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. సువిశాలమైన తీర ప్రాంతాన్ని, వివిధ సందర్శనీయ ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకంగా ప్రకాశం పరిఢవిల్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మారి టైం బోర్డు చైర్మన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజన్ అయిన ఆక్వా రంగం పురోగతి సాధించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకాశం జిల్లాలోనే అధిక సంఖ్యలో దళితులు ఉన్నట్లు చెప్పారు. వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వలసలను నివారించి వారికి స్థానికంగానే ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దిశగా వారిలో నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం దృష్టి సారించినట్లు చెప్పారు. వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో జిల్లా గొప్ప ముందు అడుగు వేసేలా ఈ ఆవిర్భావ వేడుకల్లో ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులతో పాటు వివిధ రంగాలలో ప్రతిభ చాటి జిల్లా ఖ్యాతిని పెంచిన పలువురిని అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో డిఆర్ఓ.బి. చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పల్లె విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : పల్లె స్థాయిలో ప్రతిభను గుర్తించేందుకు శ్యామల వెంకట్ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి ఈ ప్రతిభ పరీక్ష పెట్టడం పల్లె ప్రాంతాలోని విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నియోజకవర్గస్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పల్లె స్థాయిలో విద్యార్థులను ప్రతిభ గుర్తించి వారి వారి జ్ఞానాన్ని తెలియజేసే కృషి చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి మాట్లాడుతూ మారుమూల కొండ ప్రాంతంలో పుట్టి అనేక ఇబ్బందులు ఎదుర్కొని పల్లె నుంచి పట్నానికి ఎదిగి నేడు పారిశ్రామికవేత్తగా రాజకీయ నాయకుడిగా వారి గ్రామానికి కాకుండా నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలకు ఏదో ఒకటి చేసి వారి విద్యను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న శ్యామల కాశిరెడ్డిని కొనియాడకుండా ఉండలేమని తెలిపారు. టిడిపి నాయకులు శ్యామల వెంకట్ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులను వారి అభివృద్ధికి బాటలు వేసే విధంగా ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ప్రభుత్వ పాఠశాల ఎదుగుదలకు కృషి చేస్తున్నామని చేస్తూ ఉంటామని విద్యార్థులు చదువుతోపాటు సంస్కారాన్ని కూడా నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు మొదటి బహుమతి రాయల కాశా జాహ్నవి 20000 వెలిగండ్ల జడ్.పి.హెచ్.ఎస్, రెండో బహుమతి ఎం.ఆనంద్ 15 వేల రూపాయలు కనిగిరి గవర్నమెంట్ హై స్కూల్, మూడో బహుమతి బిందుప్రియ పదివేల రూపాయలు జెడ్ పి హెచ్ ఎస్ వెలిగండ్ల, కే.రోహిత్ జెడ్పిహెచ్ఎస్ ఇమ్మడి చెరువు నాలుగో బహుమతి 7వేల రూపాయలు, ఐదవ బహుమతి నందిని కంచర్లవారి పల్లి జడ్పీహెచ్ఎస్ 5వేల రూపాయల నగదుతో పాటు వీరికి మెడల్స్ అందజేశారు. ఈ క్రమంలో పాఠశాల సిబ్బంది శ్యామల కాశిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, వెంకటరెడ్డి మీనిగా కాశయ్య, కొండు విజయభాస్కర్ రెడ్డి, బొబ్బ తిరుపతిరెడ్డి (పైలట్), చిలకల వెంకటేశ్వర్ రెడ్డి, పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, శ్రీనివాసచారి, శ్రేష్ట ఫౌండేషన్ అధ్యక్షులు తగరం ఇమ్మానియేల్, జేవీవీ జిల్లా అధ్యక్షులు ఖాజా హుస్సేన్ ఉపాధ్యాయులు దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చేతల వెంకటరామయ్య, ఆవుల రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండోరా ఉద్యమం ధరణికే నుదుటి బొట్టు

విశాలాంధ్ర-పెద్దారవీడు : 1994 సంవత్సరం ప్రకాశం జిల్లా ఈదుమూడి నుంచి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కొంతమందితో మొదలైనటువంటి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ దండోరా 30 సంవత్సరాలుగా మోగుతూనే ఉంది. సామాజిక న్యాయం కావాలని ఎస్సీలో ఉన్న 58 ఉపకలాలకు రిజర్వేషన్ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ఏర్పడినటువంటి ఉద్యమం దండోరా ఉద్యమం. ఎస్సీలో ఉన్నటువంటి 58 కులాల్లో ఒకటి రెండు కులాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని కులాలవారు రిజర్వేషన్ పొలాలు పొందలేక అన్యాయం అవుతున్నారని మాదిగల యొక్క ఆలోచన విధానం. అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అనేది మాదిగ సామాజిక వర్గానికి ఉన్నటువంటి అత్యుత్తమైనటువంటి ఆలోచన విధానమే దండోరా యొక్క ముఖ్య ఉద్దేశం. మాదిగలు మాదిగ ఉప కులాలలో ఉన్న ప్రతి పౌరుడికి రిజర్వేషన్ ఫలాలు పొంది అభివృద్ధి చెందాలని అటువంటిది మాదిగల లక్ష్యం. బీసీలలో సుమారు 109 కులాలుగా ఉంటే ఏబిసిడి వర్గీకరణ జరిగి ఏ గ్రూపులో 38 కులాలు, బి.గ్రూపులో 21 కులాలు, సి.గ్రూపులో ఒక కులము, ఈ గ్రూపులో 34 కులాలు, ఈ గ్రూపులో 15 కులాలు రాజ్యాంగబద్ధంగా వారి వారి హక్కులను పొందుతున్నారు. కానీ ఎస్సీ లో ఉన్నటువంటి 58 కులాలు ఉన్నప్పటికీ కులాలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు పొందే అభివృద్ధి చెందుతున్నారు. కానీ 58 కులాలకు సంబంధించి ఏ బి సి డి వర్గీకరణకు కొందరు స్వార్ధపరులు విడదీయ వద్దని వర్గీకరణ చేయవద్దని ఏబిసిడి వర్గీకరణ అవసరం లేదని ఏవేవో కాకమ్మ కబుర్లు చెబుతూ స్వార్ధ ప్రయోజనాల కోసం స్వార్ధ రాజకీయాల కోసం ఎస్సి ఉప కులాల వర్గీకరణ అడ్డుకోవటం ఎంతవరకు న్యాయం అనేది మేధావులు ఆలోచన చేయాలి. మాదిగల ఆలోచన సామాజిక న్యాయమే అని ఆలోచన చేసి మాదిగలు వేసిన దండోరాకు ఢిల్లీ పీఠం కదిలింది. అంటే ఒక్కసారి ఆలోచన చేయండి మామూలు విషయం కాదు. ఫిబ్రవరి 7వ తేదీన భాగ్యనగరాన (హైదరాబాద్) జరుగు లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమం ద్వారా మాదిగల సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణ అమలయ్యే విధంగా మాదిగల సామాజిక న్యాయ ఉద్యమం ప్రపంచ దేశాలకు వినబడేలా దండోరా వేద్దాం మాదిగల డప్పుకు ప్రపంచ ఖ్యాతి వచ్చేలా వాయిద్ద. మాదిగ సామాజిక ఉపకులాలు అందాలని ఆశిద్దాం.

చంద్రబాబు కృషి, మోదీ సహకారంతోనే రాష్ట్రానికి నిధులు

గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-దర్శి : ఎన్డీయే బంధం, సీఎం చంద్రబాబు కృషి, రాష్ట్రం పట్ల ప్రధాని మోదీ ప్రత్యేక ఆదరణ బడ్జెట్ కేటాయింపుల రూపంలో మరోసారి స్పష్టంగా కనిపించిందని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. కూటమిపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న అపారమైన నమ్మకం, అందించిన అఖండ విజయం కేంద్ర నుంచి నిధుల రూపంలో వరదగా తిరిగి వస్తోందన్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గడిచిన బడ్జెట్‌లో ఈ బడ్జెట్‌లో కూడా రాష్ట్రం పేరు పెట్టి మరీ ప్రత్యేక కేటాయింపులు ఇవ్వడం, ప్రాజెక్టుల వారీగా నిధులు ఇవ్వడం పట్ల కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. మరీ ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు గతేడాది ఇచ్చిన రూ. 5,512 కోట్ల కంటే రూ.424 కోట్లు అదనంగా రూ.5936 కోట్లు ఇవ్వడం రాష్ట్ర జీవనాడి పూర్తిపై ఆశలు, నమ్మకాన్ని కలిగించిందన్నారు. ఎన్డీయే కొత్త ప్రభుత్వంలోనే పోలవరం తాజా డీపీఆర్ ఆమోదించారని డాక్టర్ లక్ష్మీ పేర్కొన్నారు. తద్వారా రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు వచ్చిన నిధుల్లో ఇవే అత్యధికం అన్న ఆమె ప్యాకేజీలో భాగంగా అడ్వాన్స్ కూడా ఇవ్వడంతో ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అదే సమయంలో విశాఖకు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ ప్యాకేజీని అమల్లోకి తేవడం రాష్ట్రంలో, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాల చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ఇటీవల ప్రకటించిన 11,917 కోట్లు ప్యాకేజీని నిజం చేస్తూ పాత బడ్జెట్‌లో కేటాయింపుల్ని 620 కోట్ల నుంచి 8వేల 622 కోట్లకు పెంచడం, కొత్త బడ్జెట్‌లో 3,295 కోట్లు కేటాయించడం సీఎం చంద్రబాబు, పీఎం మోదీ సంకల్పం కారణంగానే సాధ్యమైందన్నారు. బడ్జెట్‌లో కీలకంగా ప్రస్తావించిన జల్‌జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి భారీగా నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటీవలే అందుకు సంబంధించి రాష్ట్రం తరఫున రూ.70వేల కోట్లు కావాలని ప్రతిపాదనలు ఇచ్చిన నేపథ్యంలో సింహ భాగం మేలు జరిగే అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కూటమి ఎంపీలు ముందు నుంచి అన్ని రంగాలు, శాఖల వారీగా శ్రద్ధ తీసుకుని ప్రయత్నాలు చేయడం కారణంగా గత బడ్జెట్ కేటాయింపులు, ప్రకటల్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఆర్థికమంత్రి చెప్పడం కూడా రాష్ట్రానికి మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఇవి కాకుండా మౌలిక సదుపాయల కల్పనకు కేంద్రం ప్రకటించిన రూ.1.5లక్షల కోట్ల ప్యాకేజీలో ఏపీకి మంచి నిధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పరోక్షంగా అమరావతి, మెట్రో రైలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, వ్యవసాయం, విద్య రంగాల్లో భారీగా నిధుల రాకకు అవకాశం ఉందని ఆ మార్గాల్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు.

గ్రూపుల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలి

ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : పొదుపు గ్రూపు సంఘాల సభ్యుల వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని మార్కాపురం ఏరియా కోఆర్డినేటర్ ఓ సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని వెలుగు కార్యాలయంలో వివోఏలకు లోకోస్ యాప్‌లో నమోదుపై జరిగిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులు వివరాలు వారు పొందిన రుణాలు తదితర విషయాలను లోకోస్ యాప్‌లో ఎట్ల నమోదు చేయాలని ట్రైనర్లు మోబీన సుజాతాలు వివరించారు. కొనకనమిట్ల పొదిలి మండ లాల వెలుగు ఏపీఎంలు బి.సుధాకర్ కే.గోపాలకృష్ణ సీసీలు సాయిలు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వై.ఈశ్వరమ్మ అకౌంటెంట్లు నాగమణి అరుణకుమారి వివో ఏలుపాల్గొన్నారు.

రేపు మస్తానయ్య 26వ వర్ధంతి

విశాలాంధ్ర-పామూరు : సిపిఐ మాజీ మండల కార్యదర్శి నీరుకట్టు మస్తానయ్య 26వ వర్ధంతి వేడుకలను మంగళవారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపిన నీరుకట్టు మస్తానయ్య వర్ధంతి వేడుకలకు పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి వేడుకలకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్‌లు హాజరవుతారని మౌలాలి తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలు

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని పొట్లపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో ద్విచక్ర వాహనము అదుపుతప్పి కింద పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురాంతకం మండలం కంకణాలపల్లికి చెందిన దద్దాల యోగయ్య తన భార్యతో కలిసి పొట్లపాడు గ్రామంలో గుత్తికొండ రామయోగి స్వామికి మొక్కులు తీర్చుకొనుటకు వెళ్తుండగా కురిచేడు కాలవ కట్ట వద్ద మూలమలుపులో రైతులు పంట పొలాలకు నీటి పైపులు పైన రోడ్డుపై ఎత్తుగా మట్టి వేయడం వల్ల అది గమనించని యోగయ్య ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడం వల్ల అతని భార్య పెద్ద లక్షమ్మకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఇది గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి మహబూబ్ బాషా పైలట్ వెంకటప్పయ్యలు ప్రమాద స్థలానికి చేరుకుని పెద్దమ్మకు ప్రధమ చికిత్స చేసుకుంటూ వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రదేశంలో పలుమార్లు దిశక్ర వాహన దారులు ప్రమాదానికి గురవుతున్నారని ఎప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై ఎత్తు పలాలు లేకుండా చూసి ప్రమాదాలు జరగ కుండా నివారించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-దొనకొండ: గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి చెందాడు. తెలిసిన వివరాల ప్రకారం... గిద్దలూరుకు చెందిన సింగంశెట్టి బాలఉగ్ర (35) స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. జనవరి 19న కారు డ్రైవింగ్ చేస్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి గుంటూరులో ప్రవేటు వైద్యశాలలో వైద్యం పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు కలరు. పోలీసు అధికారులు, సిబ్బంది బాలఉగ్ర భౌతిక దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

'లక్ష డప్పులు వేలగొంతులు' పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : ఫిబ్రవరి 7 తేదీ హైదరాబాదులో జరిగే లక్ష డబ్బులు వెలగొంతులులు కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ఒంగోలు అంబేద్కర్ భవనంలో పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ పోస్టర్ ఆవిష్కరించారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఏబిసిడి వర్గీకరణను అమలుపరచడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని దీనికి నిరసనగా హైదరాబాద్ ఏడో తేదీన లక్ష డబ్బులు వేల గొంతులు కార్యక్రమం నిర్వహించి తమ నిరసనను తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి ఏపీ నుండి కూడా వేలాదిగా మాదిగలు తరలి రాబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి తిరువీధి బాబురావు మాదిగ, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు ప్రభుదాసు మాదిగ, పునూరి రామారావు, కోడూరి ఆదాము, గద్దల రమేష్,రాయపాటి సుబ్బారావు, కమ్మపాటి రాజీవ్, మత్తుల రవి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ హర్షణీయం : గంది

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ హర్షణీయమని దోర్నాల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సురవరం గంది వీరారెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దేశవ్యాప్తంగా వరుసగా ఎనిమిదో సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు బడుగు బలహీన వర్గాలకు చేయూతనిచ్చే విధంగా ఉందని, దోర్నాల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సురవరం గంది వీరారెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ నందు గరీబ్ యూత్ అన్నదాత, నారీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం బడ్జెట్ ప్రవేశపెట్టిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, నిర్మల సీతారామన్ తదితర నాయకులందరికీ రుణపడి ఉంటామని తెలిపారు.

నరసింహస్వామి సన్నిధిలో తిరుపతిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తెలంగాణలోని యాదగిరి గుట్ట వద్ద వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద హనుమంతుని పాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి మరియు వారి దంపతులు రజిని పాల్గొని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని తీర్థప్రసాదంలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి,దేవిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉడుముల భార్గవరెడ్డి పాల్గొనడం జరిగింది.

విభజన హామీలు అమలులో కేంద్రం విఫలం

విశాలాంధ్ర-పొమూరు రూరల్ : విభజన హామీలను అమలు పరచడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా ఆరోపించారు. ఆదివారం స్థానిక మమ్మీ డాడీ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖాదర్ భాష మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కు వేయికోట్లు ప్యాకేజీని కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని, రాజధానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అల్లాబక్ష, యాట వీరనారాయణ, తవ్వ శ్రీనివాసులు, కే శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీ కృష్ణలీలారింఛోళి' గ్రంథావిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక ఒంగోలులోని యన్‌టిఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం ప్రముఖ పద్యకవి, గిడుగు పురస్కార గ్రహీత డి.వి.యం. సత్యనారాయణ రచించిన 'శ్రీకృష్ణ లీలారింఛోళి' గ్రంథావిష్కరణ అవనిగడ్డ శాసనసభ్యులు పూర్వ ఉపసభాపతి డా.మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఘనంగా జరిగింది. కళామిత్రమండలి (తెలుగు లోగిలి)-వివిఐటి సంస్థల సంయుక్తంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పద్యం తెలుగు వాడి ఆత్మ అని, భక్తి మానవుని సన్మార్గంలో నడిపించేందుకు ఉపయోగపడుతుందని, సత్యనారాయణ రచించిన శ్రీకృష్ణ లీల రింఛోళి భక్తి పూర్వక పద్యకావ్యం సహృదయ హృదయ ప్రశంసా పాత్రమైనదని, పేజీకొక పద్యాన్ని హృద్యంగా, దానికి తగ్గట్టు గద్య రూపంలో వివరణ, అంతకు మించి వాటికి సరితూగే రీతిలో మనోహర చిత్రాన్ని జోడించటంలో కవి ఆలోచన సరళి పాఠకులను ఎంతగానో ఆకట్టుకుందని, ఈ కావ్యం కవికి ఎనలేని కీర్తిని, గుర్తింపును సంపాదించి పెడుతుందని ప్రశంసించారు.సభకు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గుంటూరు వివా-వివిఐటి తరపున ప్రతినిధిగా విచ్చేసిన మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ మా సంస్థ పక్షాన ఇలాంటి గొప్ప పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చే అవకాశం కలిగినందుకు, ముద్రించే అవకాశం కలిగించినందుకు చాలా సంతోషంగా ఉందని,ఇటువంటి రచనలు సత్యనారాయణ కలం నుంచి మరెన్నో రావాలని కోరుకుంటున్నానని, తన ఆశీస్సులను అందించారు. గౌరవ అతిథిగా హాజరైన కళారత్న, సరస్వతీపుత్ర డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పుస్తకాన్ని సమీక్షిస్తూ 152 పద్యాలతో భక్తి సాహిత్య లోకానికి ఇచ్చాడని, ఇది ముక్తకసమూహం(రింఛోళి) అయినా కావ్య గౌరవానికి ఎంతో అర్హమైనదని, ఈ గ్రంథం కవితాలాలిత్యానికే కాకుండా, అతని వ్యక్తిత్వానికి దర్పణమని, భక్తిని, భావావేశాన్ని రంగరించి రచయిత ఈపుస్తకాన్ని మనకందించారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), భాషావిభూషణ నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ, ఖజానాశాఖ ఉప సంచాలకులు అన్నపంతుల జగన్నాధరావు, కళామిత్రమండలి ప్రధాన కార్యదర్శి శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబులతోపాటు గాదెపల్లి దివాకర్ దత్తు , పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి ఘోర కవి సంపత్, యు.వి రత్నం తదితరులు కవి కృషిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు, కవులు కవిని ఘనంగా సత్కరించారు. సభకు ముందు మోదుగుల రవికృష్ణ రచించిన "శ్రీకృష్ణ భక్త సంవాదం"గల్పికను ధేనువకొండ వెంకట సుబ్బారావు బృందం చక్కగా ప్రదర్శించారు. జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రముఖ గాయిని చల్లా నాగేశ్వరమ్మ జిల్లా గేయాన్ని ఆలపించారు.ఆ తర్వాత చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన దేశభక్తి జానపద నృత్యాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ సభకు కోవెలకుంట్ల బాలకోటయ్య, మిడసల మల్లికార్జునరావు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, బీరం అరుణ, మహతి తన్నీరు బాలాజీ, ఒరుగంటి ప్రసాద్ , నాళం నరసమ్మ, కందుల మధు, నిమ్మల వెంకయ్య, బండారు సునీత, యన్.లక్ష్మీనాంచారమ్మ నిర్వహణ సహకారాన్ని అందించారు.

వధూవరులకు కదిరి ఆశీర్వాదం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారి పల్లె గ్రామానికి చెందిన కొట్టె నారాయణ కుమారుడు మిథున్ కుమార్, విన్నిల వివాహ వేడుక ఆదివారం హైదరాబాద్‌లోని మహేంద్ర ఎలైట్ వెడ్డింగ్ హాల్స్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కెవిప్రకాశ్ రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి,కదిరి పిచ్చయ్య, కదిరి కృష్ణ,కొట్టె శ్రీను, తికనం బాబురావు,నున్నా నారాయణ పాల్గొన్నారు.

నారాయణ స్వామి దేవస్థానంలో పూజలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో నారాయణస్వామికి అత్యంత పవిత్రమైన రోజైన ఆదివారం, వసంతపంచమిని పురస్కరించుకొని దేవస్థానంలో విశేషంగా పూజలు నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోపూజ నిర్వహించిన తరువాత నారాయణస్వామికి నైవేద్యం సమర్పించారు. నారాయణస్వామి వసంతపంచమి నారాయణస్వామిని దర్శించుకునేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి శ్రీగిరి నరసింహబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక దేవాదాయ సంయుక్త కమిషనర్ సూచన మేరకు నారాయణస్వామి దేవస్థానంలో అరిటాకులు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన శాశ్వత చైర్మన్ శ్రీ కుమ్మి చిన్న ఆదినారాయణ, దేవస్థాన ప్రధాన అర్చకులు మహంకాళిప్రసాద్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. దేవస్థానంకు వచ్చే భక్తులకు పొంగలి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

250 మందికి ఉచిత వైద్యసేవలు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా జే.పంగులూరు మండలం రేణంగివరం గ్రామంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైటల్ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో రేణంగివరం గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు బొరెడ్డి ఓబుల్ రెడ్డి సహాయ సహకారాలతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ ఎముకలు, కీళ్లవ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ రేణంగివరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది అని ఈ వైద్య శిబిరానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన బొరెడ్డి ఓబుల్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మంది పేషెంట్లకు ఉచితంగా బీపీ, షుగర్ ,ఈసీజీ పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించడం జరిగిందని తెలియజేశారు. గ్రామ టీడీపీ నాయకులు బొరెడ్డి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది అని, ఈ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి, జాయ్ హాస్పిటల్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ప్రతినెల మొదటి గురువారం ఉచితంగా అన్ని మల్టీ స్పెషాలిటీ విభాగాలకు ఉచిత ఓపి బిపి, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష,పాదాల నరాల స్పర్శ పరీక్ష, అలాగే గర్భిణీ స్త్రీలకు ఉచితంగా స్కానింగ్ కూడా చేయబడుతుంది అని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పసుపులేటి సుధీర్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ సౌమిత్ర పల్లవ్, దంత వైద్య నిపుణులు డాక్టర్ సరయు రెడ్డి, డాక్టర్ సుమంత్, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, శ్యామ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గన్నవరం పంచాయతీ నందు ఉన్న బ్రిడ్జి పనులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం పరిశీలించారు గత కొన్ని సంవత్సరాలుగా బ్రిడ్జి లేక గన్నవరం, గండ్లోపల్లి, చెన్నంపల్లి గ్రామాలకు వర్షం పడిందంటే వెళ్లేందుకు అవకాశం అవకాశం ఉండేది కాదు ప్రజలు నానా కష్టాలు అవస్థలు పడవలసి వచ్చేది అటువంటి పరిస్థితుల నుండి ఆయా గ్రామాల ప్రజలు త్వరలో ఊపిరి పీల్చుకొన్నారు ఎంత పెద్ద వర్షాలు పడిన ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ బ్రిడ్జిని కనిగిరి శాసనసభ్యులు పూర్తి చేయనున్నారు బ్రిడ్జి పూర్తయినట్లయితే ఆ గ్రామాలే కాకుండా జాల్లపాలెం గుమ్మల కర్ర గుడిపాటిపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలకు అత్యంత సౌకర్యవంతంగా త్వరగా మండల కేంద్రాన్ని వారి గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది ఆయా గ్రామ ప్రజలు బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతూ ఉండటంతో వారు గత కష్టాల నుండి కట్టెకుతున్నాయని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఇటువంటి ఎమ్మెల్యే మన

ప్రాంతానికి రావటం మనందరికీ శుభ పరిణామం ఎంతోమంది ఎమ్మెల్యేలు మారినప్పటికీ మా పరిస్థితి మాత్రం మారలేదని ఉగ్రన్నతోనే మా సమస్యలు గట్టిగ అని వారన్నారు. ఈ కార్యక్రమంలో కొండు విజయభాస్కర్ రెడ్డి, యేరువ చెంచు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గొరిగే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వెంకటకృష్ణకు ఏలూరి నివాళి

విశాలాంధ్ర-పర్చూరు: టీడీపీ పర్చూరు పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు గుండెపోటుతో మృతిచెందగా.. ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మృతుని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను అండగా ఉంటానని ఏలూరి తెలిపారు. కృష్ణ శవయాత్రలో ఏలూరి పాల్గొని శ్మశానవాటికకు చేరుకున్నారు. కృష్ణను కోల్పోవటం పార్టీకి తీరని లోటని ఏలూరి తెలిపారు. పార్థీవ దేహంవెంట పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి దాతలు చేయూత

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన రాటకొండ హనుమంతురావు, రాట కొండ కోటేశ్వ రరావులు గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి చేయూత అందిస్తున్నారు. హైదరాబాదులో స్థిరపడిన వారు పుట్టి పెరిగిన గ్రామాన్ని మర్చి పోకుండా తమ వంతు సహాయంగా గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి చేయూత అందిస్తున్నారు . గ్రామంలోని వీరభద్ర త్రిపురాంతక స్వామి దేవాలయము వద్ద రాజగోపురంను నిర్మించడానికి 25 లక్షల రూపాయల, సొంత నిధులతో నిర్మించగా, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వద్ద స్వామి వారి ఊరేగింపు కోసం నూతనంగా సుమారు కోటి రూపాయల నిధులతో ఏర్పాటు చేయించిన రథం, భద్రపరిచేందుకు, రథశాలను నిర్మించడానికి రూ.20 లక్షల నిధులు అవసరం కాగా, తమ వంతు సహాయంగా ఏడు లక్షలు ఇచ్చి రథశాల నిర్మాణానికి సహకరించారు, ఇవే కాక గతంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందించారని, గ్రామస్తులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న అన్నదమ్ములను గ్రామస్తులు వరదబాబు, వంకాయలపాటి సుబ్బారావు, ఈరపనేని వాసు, డి వీరయ్య చౌదరి, గుమ్మడి సుధీరు తదితరులు అభినందించారు.

వినుకొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకునిగా జనార్ధన్‌రావు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : కృష్ణ, గుంటూరు పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వినుకొండ నియోజకవర్గ పరిశీలకులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ సందర్భంగా కోటపాటి జనార్ధన్ రావు మాట్లాడుతు నాపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

బహుజనులకు కల సాకారం చేయాలి

విశాలాంధ్ర - చీరాల : బహుజనులకు రాజకీయ అధికారం వచ్చేలా బహుజనుల రాజ్య కల సాకారం దిశగా అడుగులు వేయాలని బహుజన సమాజ్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటి మార్కు అన్నారు.బహుజన సమాజ్ పార్టీ చీరాల నియోజకవర్గ కార్యాలయంలో గొర్రెపాటి రవికుమార్ అధ్యక్షతన చీరాల మండల ప్రెసిడెంట్‌గా మైలపల్లి పాల్‌ని నియమించారు.ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో బహుజనులకు రాజకీయ అధికారాన్ని తీసుకురావడం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో కాన్షీరామ్ బహుజన సమాజ్ పార్టీని నిర్మాణం చేశారన్నారు. బహుజన రాజ్యం రావాలంటే కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చెయ్యాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్ లెవల్ కమిటీలు,క్లస్టర్ లెవల్ కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు.అనంతరం చీరాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పఠాన్ కలాం, చీరాల పట్టణ ఉపాధ్యక్షులుగా రమణాను ఎంపిక చేశామన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు దుడ్డు భాస్కరరావు,సుధాకరరావు, మల్లి బాబు, రాజు,నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతం

విశాలాంధ్ర - బాపట్ల : అంజుమన్ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితం మెడికల్ క్యాంప్ ఘనంగా జరిగిందని అంజుమన కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రహీం జానీ మాట్లాడుతూ అంజుమన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 158 మంది వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు అన్నారు అంజిమాన్ కమిటీ అనేక పర్యాయలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఇదేవిధంగా అంజుమన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ కూడా జారీ చేయడం జరిగిందన్నారు. అంజుమన్ సంస్థ అనేది ఒక సేవా దృక్పథంతో బాపట్ల పట్టణంలోని పేద వారికి అండగా నిలిచిందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్షిప్ తో పాటు చనిపోయిన వారికి మట్టి ఖర్చులతో పాటు వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం కూడా అందిస్తున్న అన్నారు .అంతేకాకుండా పట్టణంలోని బరియల్ గ్రౌండ్ బాగోగులు కూడా అంజుమన సంస్థ నిర్వహిస్తుందన్నారు. అనంతరం విశిష్ట అతిథి అయిన ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంజుమన సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.దేవుడు అంజుమన్ సంస్థకు అండగా ఉండాలని నా వంతు పూర్తి సహాయ సహకారాలు అన్జమాన్ కమిటీకి ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన తెలిపార. పట్టణ టిడిపి అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 మంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇప్పించి వారందరికీ సర్టిఫికెట్లు కూడా అందించడం గర్వకారణం అన్నారు . అంజుమన్ సంస్థ విద్యను ప్రోత్సహించి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇప్పించడం చాలామందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జమ్రుద్ భాష,జనసేన సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ, అంజుమన్ కమిటీ సెక్రటరీ అబ్దుల్ కరీం, కమిటీ సభ్యులు మతపెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బాపట్ల జిల్లా కన్వీనర్ బండారుపల్లి హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక భాజపా కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన చీరాల మండలం, పట్టణం, వేటపాలెం మండలం అధ్యక్షులతో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం లోని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం లోని ప్రభుత్వం రాష్ట్రానికి సహాయ సహకారాలు అందిస్తూ వివిధ పథకాలకు నిధులు అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుద్దంటి భవాని, బక్క మనోహర్ రెడ్డి, మసనం విద్యాధర్ లు, మేడికొండ భరణీరావు, నాసిక శివాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం దేవాంగపురి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా సోమవారం అనగా 03.02.25 ఉదయము 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవాంగ పురి, రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్, పాత చీరాల, కొత్తపాలెం, గాంధీనగర్ గ్రామపంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఈఈ బి హరిప్రసాదరావు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయ కోరారు.

వైద్యశిబిరం విజయవంతం

విశాలాంధ్ర - చీరాల : రోటరీ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయ వంత మైందని నిర్వాహకులు తెలిపారు.చీరాల రోటరీ క్లబ్ హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో రక్త నాళాల(వేరికోస్ వీన్స్) ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సోమాచారి పర్యవేక్షణలో 72 మందికి వైద్య పరీక్షలు జరిపి హైదారాబాద్ సర్జరీకి 30 మందిని రమ్మని రోగులకు వైద్యులు తెలిపారు. చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలు దాసు రామకృష్ణ, బి హేమంత్ కుమార్, డివి సురేష్,కె శ్రీనివాసబాబు, జాలాది కృష్ణ, ప్రతాప్, జాగర్లమూడి సురేష్, జివై ప్రసాద్, శ్రీనివాస రావు,బాబూరావు, పున్నారావు, నిత్యానంద లాల్,రోటరీ సభ్యులు,హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలికంగా పీజీఆర్ఎస్ రద్దు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. అర్జీలు ఇవ్వడానికి బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చే వారు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

నూతన దంపతులకు ఎమ్మెల్యే వేగేశన ఆశీస్సులు

విశాలాంధ్ర - బాపట్ల : పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో కర్లపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కాజా మొహిద్దీన్ కుమార్తె వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల పార్టీ అధ్యక్షులు అఫ్జల్, బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఫరీద్ మస్తాన్,మాజీ ఎంపీటీసీ షేక్‌బాజీ, నియాజి,నిజం,మీరా, పిట్ల వసంత రెడ్డి, తెలుగుదేశం,జనసేన, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ముండ్లమూరు : నడుచుకుంటూ రోడ్డు పై వెళుతున్న వ్యక్తి మోటార్ సైకిల్ ఢీ కొని మృతి చెందిన సంఘటన ఊళ్ళ గల్లు లో చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన శేషయ్య అను అతను తన ఇంటి వద్ద నుండి గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్లుచుండగా మార్గమధ్యలో అద్దంకి దర్శి రోడ్ లోని నేల చప్టా మీదుగా నడుచుకుంటూ వెళ్ళుచుండగా మోటార్ సైకిల్‌గుద్దడంతో నేలపై పడి తలకు, తన రెండు కాళ్లకు బలమైన గాయాలు అయ్యాయి. క్షత గాత్రుని 108 అంబులెన్స్ లో దర్శి ఆసుపత్రికి అక్కడ నుండి మెరుగైన వైద్యం కొరకు ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తీసుకొని అక్కడ మృతి చెందాడు. హాస్పటల్ నుండి వచ్చిన స్టేట్మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్. ఐ వై. నాగ రాజు తెలిపారు.

రహీముల్లాకు పితృ యోగం

విశాలాంధ్ర-పామూరు : జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి యలమందల రహీముల్లా తండ్రి హుస్సేన్ అనారోగ్యంతో ఆదివారం ఉదయం స్వర్గస్థులైనారు. ఆయన పార్థివ దేహానికి టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు పూలమాలతో ఘన నివాళులర్పించారు. మండల టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు ,ఎంపీటీసీ బొల్లా నరసింహ చౌదరి, మెంటా నరసింహారావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, మాజీ సర్పంచ్ డి.వి మనోహర్, ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, బిజెపి కె.రమణయ్య, పాలపర్తి రమణయ్య, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, కావేరి రసూల్, మండ్ల రమణయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

హజరత్ ఇమామ్ హుస్సేన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొమరోలు : హజరత్ ఇమాం ఎ హుస్సేన్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 03 శాబాన్ 1446 హజరత్ ఇమామ్ హుస్సేన్ జన్మదిన వేడుకల సందర్భంగా కొమరోలు ప్రభుత్వ పీర్ల చావిడి (పెద్ద పీర్ల చావిడి) యందు ప్రతేక చదింపులు మరియు ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

'ఉపాస' వైద్యులు మోసం..

- ఇవ్వవలసిన చికిత్స బదులుగా మరోకటి
- వ్యక్తి మృతి ,బంధువుల ఆరోపణ
- ముందే ప్రాణాంతం అని చెప్పాం : వైద్యుల వివరణ

విశాలాంధ్ర -ఒంగోలు : రోగికి వచ్చిన రోగానికి బదులుగా వేరే రోగానికి వైద్యం చేయటం వల్లే హుస్సేన్ చనిపోయారని మృతుని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలులోని రైల్వే స్టేషన్ రోడ్డు గల ఉపాస సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎదుట మృతుని బంధువులు హాస్పిటల్ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళితే ఒంగోలులోని భరత్ కాలనీకి చెందిన ఎస్కే హుస్సేన్ (50) జ్వరంతో ఉపాస హాస్పిటల్ యాజమాన్యంలో ఒకరైన డాక్టర్ శ్రీనివాసరావుకు చెందిన సిమ్స్ హాస్పిటల్‌లో 2025 జనవరి 15వ తేదీన వైద్యం నిమిత్తం చేరారు. మూడు రోజుల ట్రీట్మెంట్ తర్వాత మెరుగైన వైద్యం పేరుతో జనవరి 18వ తేదీన ఉపాస సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు పేషెంట్‌ను మార్చారు. అప్పటినుండి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు ట్రీట్మెంట్ కొనసాగించిన వైద్య బృందం చేతులు ఎత్తివేసి, చెన్నైకి తరలించాలని మృతుని బంధువులకు సూచించారు. హుస్సేనును చెన్నైకి తరలించేందుకు ప్రయత్నిస్తున్న లోపే ఆదివారం మృతి చెందారు. దీంతో మృతిని బంధువుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోగికి వచ్చింది ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి అని, అయితే వైద్యులు ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్యం నిర్వహించకుండా, వేరే దానికి వైద్యం నిర్వహించడం వల్లే హుస్సేన్ మృతి చెందారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగాడు. హాస్పిటల్ వైద్య బృందం మాత్రం తాము చేసింది సరైన వైద్యమేనని, క్రిటికల్ కేస్ అని ముందే చెప్పామని, వారు ఇష్టపడే ఇప్పటివరకు వైద్యం చేయించారని, రోగిని బతికించేందుకు తాము శాయ శక్తుల కష్టపడ్డామని వివరణ ఇచ్చారు.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం

సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి శ్రీనివాస్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : స్థానిక సీపీఐ కార్యాలయంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. పేద వర్గాలను దగా చేస్తున్న బడ్జెట్గా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి శ్రీనివాస్ అన్నారు. ఈ బడ్జెట్ కార్మికులకు కర్షకులకు, సాధారణ ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరదు అన్నారు. పోలవరం ప్రాజెక్టు గురించి ఎటువంటి ఊసే లేదన్నారు. ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు కు ప్రేత్యేక నిధులు లేవు. అలాగే వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించక పోవడంపై అయన అసహనం వ్యక్తం చేసారు.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కలిపిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కరన్నారు.ఉయోగం లేని బడ్జెట్.బీహార్, ఢిల్లీ లొ ఎన్నికలు జరుగుతున్నదున ఆ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించారని అన్నారు.విశాఖ రైల్వే జోన్, విశాక ఉక్కు రమాయ పట్నం పోర్టుకు ప్రత్యేక బడ్జెట్ బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు రామయ్య మట్లాడుతూ రైతులకు మేలు చేస్తే ఉద్దేశం ప్రభుతకాలకు లేదన్నారు. దీనికోరాకు 5 వ తేదీన నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్క రైతు పాల్గొని రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వాలకు తెలియపరచాలని అయన కోరారు. దళిత నాయకులు ఆంజనేయులు మట్లాడుతూ గత బడ్జెట్ లొ 70 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాగా ఈ బడ్జెట్ లొ కేవలం 40 కోట్లు కేటాయించడం జరిగింది. అంటే మిగిలిన 30 కోట్ల రూపాయల దళిత దనాన్ని ప్రభుత్వం దండుకుంటుంది అన్నారు.యస్సి ఎస్టీ అట్రాసిటీ డబ్బులు ఇంతగావరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకపోవడం పై అయన మండిపడ్డారు.దళితుల అభివృద్ధికి ప్రవేశా పెట్టిన బడ్జెట్ బట్టి దళితులపై వున్నా మమకారం అర్ధం అవుతుంది అన్నారు.దళితుల హాస్టల్ లొ వున్నా ఆహార పట్టికలపై ప్రత్యేక శ్రద్ద చూపాలి అన్నారు. స్టోర్ బియ్యం అన్నం పెట్టి అందులో పోష్టిక ఆహారం అనడం హాస్యాస్పదం అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలపై ప్రధాన మంత్రి, ముఖ్య మంత్రి, ఉపముఖ్యమంత్రి, యమ్మెల్యే ఫొటోలు వేసుకొని ప్రచారం మాత్రమే చేస్తున్నారు అన్నారు. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ కు దళిత వర్గ ప్రజలు రాబోయే రోజుల్లో సరైన సమాధానం చేరతారని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల నాయకులు, ప్రజలు వున్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక పామూరు బస్టాండ్ నందు ఆదివారం సాయంత్రం సీఐ ఖాజావలి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ ఖాజావలి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు తెలియజేశారు. వాహనదారులు మద్యం సేవించడం, హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

పాలేటి గంగమ్మకి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలిసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగాభవాని అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువజామునే అమ్మవారికి పాల పొంగళ్ళు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపిరెడ్డి ఓబుళరెడ్డి దంపతులకు సన్మానం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని వేములపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన గోపిరెడ్డి ఓబుళరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం గిద్దలూరు పట్టణం, నరవ రోడ్డులోని ముత్తుముల భాస్కర్ రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలి ముఖ్య అతిథిగా గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని వారి దంపతులకు పూలమాల శాలువా వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

బాపట్ల పట్టణం నరాలశెట్టివారిపాలెంకు చెందిన నరాలశెట్టి ఏడుకొండల వెంకటేశ్వరరావు గారి కుమారుడు నరాలశెట్టి లీలాకృష్ణ (సెల్ 9000025267) వారు తెలియజేయునది ఏమనగా నా పేరిట గల పాస్‌పోర్టు నెంబర్ L8890997 ఒరిజినల్ ది.05-01-2025న శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ నుంచి బాపట్ల వస్తూవుండగా రైలులో పోయినది. ఎవరికైన దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

డీఎస్పీ కార్యాలయంలో ఐజీ తనిఖీ

విశాలాంధ్ర-మార్కాపురం : వార్షిక తనిఖీలలో భాగంగా గుంటూరు రేంజ్ ఐ.జి త్రిపాఠి అదివారం డిఎస్పీ ఆఫీస్‌ను తనిఖీ చేసారు. ఈ తనిఖీలలో సబ్ డివిజన్ కార్యాలయ అన్నీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ సి, ఎస్ టి పోక్సో కేసులు, క్రైమ్ రిజిస్టర్స్, జిసిఆర్ రిజిస్టర్స్, మంత్లీ రివ్యూ ఫైల్స్, ఓతీ మరియు ఇతర రికార్డ్స్ లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా ప్రకాశం జిల్లా 56వ అవతరణ దినోత్సవం సందర్భంగా డిఎస్పీ కార్యాలయంలో రేంజ్ ఐ.జి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి మరియు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనముగా నివాళులు అర్పించారు. సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులు, నేరాలు మరియు శాంతి భద్రతల అంశాలపై డీఎస్పీ నాగరాజు తో క్షుణ్ణంగా చర్చించారు. గతంలో నమోదు కేసులు, వాటిపై చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతుల గురించి పోలీస్ అధికారులను అడిగారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతి అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసులను క్వాలిటీ ఆఫ్ ఇన్విస్టిగేషన్

తో ఛేదించి నిందితులకు తప్పనిసరిగా శిక్షింపదేలా చేయాలని, ఒక నిర్దిష్ట ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పెండింగ్ కేసులను తగ్గించాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పెట్టి కేసులను నమోదు చేయాలని, రిపీటెడ్ అఫెండర్స్ పై మరియు భూకబ్జాదారులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై దృష్టి సారించాలని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఐజి ఆదేశించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి, సైబర్ నేరాలపై ప్రజలు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యాన్నిపెంపొందించుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలందించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా కృషి చెయ్యాలని సూచించారు. ఈ సందర్భంగా గుంటూరు ఐజి వెంట స్థానిక డిఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, సబ్ డివిజన్ సిఐలు పి.సుబ్బారావు, కె .మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్ రావు, ఎస్సైలు మరియు సిబ్బంది ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'అన్నా'కు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా తనను నియమించేందుకు సహకరించిన నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు,అన్నా కృష్ణ చైతన్య ల ను ఆదివారం ఎమ్ ఉత్తమ్ కుమార్ మర్యాదపూర్వకం గా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇరువురి ని దుశ్శాలువులతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బుదాల సతీష్,తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు,దర్శి నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు కాలూరి రమణ, తర్లుపాడు సర్పంచ్ ఎబినేజర్, పవన్,రత్నం,కిషోర్,ప్రసాద్, విజయ్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన దప్పిలి శంకర్ రెడ్డి కుమారుని వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడి యువకుడి మృతి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ట్రాక్టర్ తిరగబడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని లేళ్ళపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లేలపల్లి గ్రామానికి చెందిన గుమ్మా శ్రీనివాసులు 22 బంధువు తన పొలంలో పని చేసేందుకు కుదంపల్లి గ్రామంలో వున్నా తన బంధువుల వద్ద ట్రాక్టర్ తీసుకొని వచ్చారు. అయితే ట్రాక్టర్ తో పని అయిపోయి ట్రాక్టర్ తిరిగి ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ తీసుకొని శ్రీనివాస్ కుంధంపల్లి బయలు దేరాడు.అయితే మిట్ట పాలెం, లేళ్లపల్లి కి మధ్యలో వున్నా పొలాల్లోకి సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈక్రమంలో శ్రీనివాసులు ట్రాక్టర్ క్రిందపడి తీవ్ర గాయాలు అయ్యి అక్కడికి అక్కడే మృతి చెందాడు.దీనితో విషయం తెలుసుకున్న బంధువుకు గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. స్థానికులు తెలిపినా సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినీలకు నేత్రపరీక్షలపై అవగాహన

విశాలాంధ్ర - చల్లపల్లి: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో చల్లపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు నేత్ర పరీక్షా శిబిరం, అవగాహన సమావేశం జరిగింది. ఫౌండేషన్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షులు, మోడరన్ ఐ కేర్ నేత్రవైద్యులు డాక్టర్ జి.భానుమూర్తి బాలికలకు నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టిలోపాలు ఉన్నవారిని గుర్తించి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. అనంతరం మానవ హక్కులు, బాలల హక్కులు, విద్యాహక్కులు, బాల్యవివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలకార్మిక నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.అరుణకుమారి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, నేత్రవైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు విజయా అకాడమీ విద్యార్థినిలు

విశాలాంధ్ర - చల్లపల్లి: శ్రీ విజయా అకాడమీ విద్యార్థినీలు వాలీబాల్ జూనియర్స్ విభాగంలో వక్కలగడ్డ జడ్పీహైస్కూల్ టీజ్లో) విజయం సాధించి సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. లింగారెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్లో కృష్ణాజిల్లా సెకండరీ స్కూల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాల్బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు జరుగ్గా, విజయా అకాడమీ విద్యార్థినిలు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్లో లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీలు టి.అర్జునరావు, ఎం.కోటయ్యలను ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు అభినందించారు.

ప్రతిష్టామూర్తికి గ్రామోత్సవం

విశాలాంధ్ర - చల్లపల్లి: స్థానిక నారాయణరావు నగర్ కాలనీలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవాలయ ప్రతిష్టామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచగవ్య ప్రాసన, క్షీరాధివాసము, అధిహోమము, నిత్యహోమము, అనంతరం ప్రతిష్టామూర్తి గ్రామోత్సవం, రాత్రి విష్వక్సేన ప్రార్ధన, నిత్యహోమము, నవగ్రహ ఆరాధన, విశేష మహాశాంతి హోమము, ధాన్యాధివాసము, పుష్పాధివాసము, శయనాధివాసము తదితర పూజాకార్యక్రమాలు నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితులు బ్రహ్మత్వంలో జరిగాయి. ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్టాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం గం.11.45 లకు రేవతీ నక్షత్రయుక్త మేష లగ్న పుష్కరాంశమందు వరసిద్ధి వినాయక స్వామి ప్రతిష్ఠామహోత్సవం జరుగనుంది.

ఘనంగా ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-గిద్దలూరు : భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో పట్టణ బీజేపీ ఆఫీస్‌లో ప్రకాశము జిల్లా అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మేధో కమిటీ మెంబర్ రెడ్డి మల్లా రెడ్డి మాట్లాడుతూ ప్రకాశము జిల్లా నెల్లూరు, గుంటూరు,కర్నూలు జిల్లా నుండి ప్రకాశం జిల్లా 1972 ఫిబ్రవరి 2 తేదీన టంగుటూరి ప్రకాశం పంతు లు గుర్తుగా ప్రకాశము జిల్లా ఏర్పాటు చేయడం జరిగింది, అని ఆ ఆంధ్ర సింహం తెల్లదొరలకు ఎదురొడ్డి గుండె చప్పుడు గుర్తుగా ఏర్పాటు చాల సంతోషం ప్రతి పౌరుడు ఆయనను ఆదర్శంగా తీసు కుని దేశం పట్ల తోటి పౌరుల పట్ల బాధ్యత గా మెలగా లని,దేశ ఆర్థికాభివృద్ధి లో భాగస్వామ్యము పాలు పంచుకోవాలని కోరడం జరిగింది. పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, పట్టణ జనరల్ సెక్రటరీ మునగ నూరి రామ కృష్ణ, బీజేవైఎం ఉపాధ్యక్షులు సంతోష్ జిల్లా కార్య వర్గ సభ్యులు వీర చక్రము నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం ...

విశాలాంధ్ర-వీరుల పాడు : మండలంలోని జయంతి గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారంతో 12 మందికి గాయాలతో పాటు ఇదే కుక్క మరో రెండు కుక్కలను కూడా కరవడంతో అవి రెండు చనిపోయిన ఘటన ఆదివారం ఉదయం జయంతి గ్రామంలో చోటు చేసుకుంది. సమాచారం మేరకు ఎక్కడ్నుంచో వచ్చిన ఓ పిచ్చికుక్క గ్రామంలో తిరుగుతూ కనిపించిన వారిని కరవడంతో 12 మంది గాయాల పాయలయ్యారు. పిచ్చి పట్టిన కుక్కను గ్రామస్తులు వెంబడించి చంపినట్లు, గాయాల పాలైన 12 మంది కొంతమంది వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ మరి కొంతమంది నందిగామ ప్రభుత్వాసుపత్రిలోనూ చికిత్స తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వీరంతా ఆరోగ్యంగానే ఉన్నట్లు ఏ విధమైన సమస్య లేదని స్వల్ప గాయాలు మాత్రమే కావడంతో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన ట్లు గ్రామ సెక్రెటరీ ఐవి రామారావు తెలిపారు. గ్రామంలోని కుక్కల బెడదను తగ్గించేందుకు సోమ వారం తెలంగాణ రాష్ట్రం నుండి కుక్కలను పట్టుకునే దుకు కొంతమందిని రప్పిస్తున్నట్లు వీటిని పట్టుకొని సుదూర ప్రాంతం అడవులలో వదిలి వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు రామారావు తెలిపారు.

విద్యార్థి వ్యతిరేక కేంద్ర బడ్జెట్

-విద్యార్థులను మోసం చేసిన మోదీ బడ్జెట్

-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-ఒంగోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి భారతీయ విద్యార్థుల ఆకాంక్షలకు అనుకూలంగా లేని బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్ కళ్యాణ్, రామంజి యాదవ్ విమర్శించారు.స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగాన్ని బలోపేతం చేసి ముఖ్యమైన చర్యలు లేవని ఇది ప్రభుత్వ విద్యను క్రమ పద్ధతిలో విడదీయటానికి ఆర్ఎస్ఎస్, బీజేపీల అజెండా కొన సాగింపుగా ఉందని ధ్వజమెత్తారు. బడ్జెట్లో విద్యారంగానికి పది శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా అమె కేటాయించలేదని అన్నారు గతంతో పోలిస్తే ఈ బడ్జెట్లో ఉన్నత విద్యకు రూ.5000 కోట్లు ఈసీజీకి మూడు వేల కోట్లు ఏఐసీటీఈకి రూ.200 కోట్లు నిధులు కోత వేశారని తెలి పారు. దేశంలో నూతన విద్యా విధానం అమలు చేసి విద్యను ప్రైవేటీకరణ చేసే కుట్ర చేస్తుందని దీని బట్టి అర్థమవుతుంది విభజన హామీల ప్రకారం 11 కేంద్ర విశ్వవిద్యాలయాల ఏర్పాటు పై బడ్జెట్ లో ఎలాంటి ప్రకటన చేయలేదు. ఆంధ్రప్రదేశ్ పై బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు ప్రభుత్వ విద్య బలోపేతయానికి చర్యలు తీసుకోకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారని ఇది పూర్తిగా విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ అని వారన్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం పిట్టువారిపాలెం గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో చీరాల నియోజక వర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల నియోజక వర్గ ప్రజలు అభివృద్ధి పథంలో నడిచేలా చూడాలని, ప్రజ లందరూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో పిట్టువారిపాలెం ప్రజలు, తెదేపా, భాజపా, జన సేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

విశాలాంధ్ర - చీరాల : ఆరోగ్యమే మహాభాగ్యమని తమ జీవన విధానంలో యోగ అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని యోగ టీచర్ శివకోటేశ్వరరావు అన్నారు.ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో అసోసియేషన్ కార్యదర్శి అత్తలూరి రామారావు అధ్యక్షతన ఆరోగ్య సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మనుషులు జీవన విధానంలో మానసిక ప్రశాంతత ముఖ్యమన్నారు. సమాజం ఎడల అవగాహన కలిగి పూర్తి ఆరోగ్యంగా జీవించాలని యువత పెద్దలు అనే తేడాలేకుండా యోగ చెయ్యడం అలవాటు చేసుకోవా లన్నారు.ఈ కార్యక్రమంలో వి ఎస్ ఆర్ శర్మ,సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, ఎం కోటేశ్వర రావు,ఊర మస్తాన్రావు, ఎం ఎస్ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర - బాపట్ల : గ్రాడ్యుయేట్ ఎన్నికల కారణంగా బాపట్ల జిల్లాలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు అయ్యిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ రద్దు అమలులో ఉంటుందని కలెక్టర్ జె వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున పీజీఆర్ ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందన్నారు. ఫిర్యాదుల నమో దు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించవచ్చన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసే వరకు మీకోసం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులను పంప వచ్చన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, కలెక్టరేట్ కి వచ్చి ఎవరూ ఇబ్బంది పడవద్దని ఆయన కోరారు.

జవాన్ నగేష్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని చింతాయ పాలెంకు చెందిన లుక్కా నగేష్ 22 సంవత్సరాలు సై న్యంలో పనిచేసి పదవి విర మణ పొంది ఆదివారం స్వగ్రామం చింతాయపాలెంకు విచ్చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కర్లపాలెం ముకుంద టీ స్టాల్ వద్ద నుంచి బాణ సంచా కాల్చుతూ పూలు చల్లుతూ స్వాగతం పలికి గ్రామానికి తీసుకుని వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లుక్కా పవన్ కుమార్, కాటూరి దుర్గాప్రసాద్, ఈపురి నగేష్, కర్రీ బాలాజీ, ప్రసాద్, వెంకట దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహోత్సవ పోటీల్లో హోలీక్రాస్ ప్రభంజనం

విశాలాంధ్ర - బాపట్ల : విజ్ఞాన్ యునివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ పోటీల్లో వాలీబాల్ క్రీడనందు హెూలి క్రాసు. విద్యార్థులు ప్రతిభ సాధించారు.హోలీక్రాస్ కరస్పాండెంట్ ప్రిన్సిపల్ సిస్టర్ జ్యోతి తెలిపిన వివరాముల మేరకు జనవరి 31 ఫిబ్రవరి 1వ తేదీల్లో బాల మహోత్సవ్ పోటీల్లో హోలీక్రాస్ విద్యార్థులు ప్రతిభ సాధించారని తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రతిభ చూపేలా అడుగులు వేయడానికి హోలీక్రాస్ యాజమాన్యం నిత్యం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులను, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిష కనపరిచే విధంగా పీఈటీ మార్చు నవీన్‌బాబు, వీర శేఖర్, జెస్సీలను అభినందించారు. అనంతరం క్రీడాకారులను ట్రోఫీ మెడల్స్‌తో సత్కరించారు.

ఏపీజేఏసీ అమరావతి చైర్మన్‌గా 'పిన్నిక'

విశాలాంధ్ర-ఒంగోలు: ఏపీజేఏసీ అమరావతి చైర్మన్‌గా పిన్నిక మధుసూధనరావు ఎంపికయ్యారు. ఏపీజేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘ సమావేశ మందిరం నందు జరిగింది. ఈ సమావేశములో ఏపీజేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా శాఖ చైర్మన్ గా పిన్నిక మధుసూధనరావుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.వీరు ప్రస్తుతం జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘము అధ్యక్షులుగా పనిచేయుచున్నారు. ఈ సమావేశం అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్ వేణు గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శానికి జిల్లా జనరల్ సెక్రటరీ కందుల వెంకటేశ్వర్లు,ఏపీజేఏసీ అమరావతి మహిళా చైర్ పర్సన్ ఎన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ మరియు రెడ్ క్లాస్ ఫోర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ కోమటిగుంట వెంకటేశ్వర్లు, డ్రైవర్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆంజనేయ కుమార్. రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్ వాసుదేవరావు, ట్రెజరర్ ఊత కొలు శ్రీనివాసరావు మరియు ఏపీజేఏసీ అమరా వతి కార్యవర్గ సభ్యులు ఇంద్రగంటి ఆంజనేయులు, అనపర్తి ఇస్మాక్ మరియు కార్యవర్గ సభ్యులు మధుసూధనరావును ఘనంగా సత్కరించారు.

మానవత్వం చాటిన అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పట్టణంలో ఉన్న శివాలయం దగ్గర ఉన్న యా చకులకు బాపట్ల అడిషనల్ ఎస్పీ భోజనం దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ అనాథలను యాచకులకు పట్ట ణంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో యాచకులు ప్రతినిత్యం రాత్రి సమయంలో దేవాలయాల దగ్గర ఫుట్ పాత్‌లపై నిద్రిస్తున్నారన్నారు. వారికి కొంత ఉపశమనం కల్పించడానికి నా వంతుగా దుప్పట్లు అలాగే భోజనం ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. అలాగే సమాజంలో ఉన్నటువంటి వారికి మన వంతు సాయం చేయాలని ఆయన అన్నారు. వారి వెంట ఏవో బిల్ల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

4న ఉచిత ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సంద ర్భంగా బుడే సాహెబ్ మెమో రియల్ సొసైటీ ఆధ్వర్యంలో బాలాజీ హాస్పిటల్ పొన్నూరు వారి సౌజన్యంతో ఈ నెల 4వ తేదీన హెల్త్ కేర్ మెడికల్స్ అల్లూరు నందు ఉచిత ఆరోగ్య శిబిరం, క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన సదస్సును నిర్వ హిస్తున్నట్లు బుడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ షేక్ ఫజల్ రెహమాన్, ఆర్గనైజర్ జి.శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ ఆరోగ్య శిబిరంను పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

విశాలాంధ్ర - వేటపాలెం : అభ్యుదయ భావాలతో అక్షరాలు కలిపి నిరంతర ప్రజా సేవలో ఉంటూ ప్రాణాలు విడిచిన కొల్లిమర్ల సాంబశివరావు కుటుంబానికి అండగా ఉంటామని చీరాల శాసన సభ్యులు మాలకొండయ్య అన్నారు.ఆదివారం ఇటీవల మరణించిన జర్నలిస్టు కొల్లిమర్ల సాంబ శివరావు కుటుంబాన్ని చీరాల శాసన సభ్యులు మాలకొండయ్య పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తన భావాలనే అక్షరాలుగా మార్చి చివరి నిమిషం వరకు జర్నలిస్టుగా కొనసాగిన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ జర్నలిస్టులు , బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.